క్లుప్తంగా

వ్యవసాయాధికారిగా శ్రీనివాస్



అడ్డతీగల: అడ్డతీగల మండల వ్యవసాయాధికారిగా సీహెచ్. శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటి వరకూ ఇక్కడ వ్యవసాయాధికారిగా పనిచేసిన సువర్ణకుమారి కృష్ణా జిల్లా గొల్లపూడికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ అనపర్తి ఏవోగా పనిచేశారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి వారికి సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. అన్ని రైతు సేవా కేంద్రాలకు వరి విత్తనాలు వస్తాయన్నారు. మొలకశాతం పరిశీలించి రైతులకు పంపిణీ నిర్వహిస్తామన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



చింతపల్లిలో మాజీ రెవెన్యూ అధికారిని సన్మానిస్తున్న సిబ్బంది

చింతపల్లి: మండల కేంద్రంలో జాతీయ రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని తహసీల్దారు కార్యాలయంలో పూర్వపు అధికారులను సన్మానించారు. కార్యాలయ సిబ్బందితో పలు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా రిటైర్డ్ ఆర్ఐ సన్యాసిదొరను ఘనంగా సత్కరించారు. డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్, ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్ఓలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దాత అరుణ్‌కుమార్

అరకులోయటౌన్: మండలంలోని బోసుబెడ గ్రామంలో సామాజిక కార్యకర్త వంతాల అరుణ్‌కుమార్ స్థానిక వృద్ధ మహిళలకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికుడు తారకనాథ్ వర్ధంతి సందర్భంగా తన వంతుగా ఈ కార్యక్రమం చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పల్టాసింగి విజయ్‌కుమార్, నాయకులు కామేష్, శేఖర్, స్థానికులు కృష్ణారావు, క్రాంతి కుమార్, సురేంద్ర, అనిల్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక డీఎస్సీపై సీఎం స్పష్టమైన ప్రకటన ఇవ్వాలి



మాట్లాడుతున్న బాలదేవ్ తదితరులు

అరకులోయటౌన్: ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ, నూరుశాతం ఉపాధ్యాయ, ఉద్యోగాల కల్పనకు సంబంధించి రిజర్వేషన్‌పై ప్రధాని మోదీ సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన ప్రకటన చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక డీఎస్సీపై నిర్లక్ష్యం చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు శతశాతం ఉద్యోగ నియామక రిజర్వేషన్ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ నుంచి ఏజెన్సీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా, ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



సున్నంపాడులో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో ముత్యాలరావు

రంపచోడవరం: ఐదు సంవత్సరాలు నిండిన బాల బాలికలందరిని ఒకటో తరగతిలో చేర్పించాలని మారేడుమిల్లి ఎంఈవో–2 వీరవిల్లి ముత్యాలరావు అన్నారు. మండలంలోని సున్నంపాడు ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు పాఠశాలకు రావాలని విద్యార్థులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా మెనూ ప్రకారం వండి విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులను సూచించారు. విద్యార్థి సామర్థ్యాలు మెరుగపడేలా బోధించాలని సూచించారు. శనివారం నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సంలో మండలంలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ పాల్గొవాలన్నారు.

ఆశల సాగు



వేరశనగ పంట

- పెరుగుతున్న వాణిజ్య పంటల సాగు
- 200 ఎకరాల్లో వేరుశనగ పంట
- అనుకూలించిన వాతావరణం



అంతర పంటల సాగుకు యంత్రంతో దుక్కి చేస్తున్న రైతు

దుంబ్రిగుడ: మండలంలోని గిరిజన వ్యవసాయ రైతులు వాణిజ్య పంటలపై మక్కువ చూపిస్తున్నారు. సుమారు 200 ఎకరాల్లో వేరుశనగ పంటను వేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఇటీవల గిరిజన ప్రాంతంలో వర్షాలు పడుతుండడంతో దుక్కులు దున్ని, పవర్ టిల్లర్లతో దమ్ముకొట్టి వేరుశనగ విత్తనాలను వేశారు. ప్రస్తుతం మండలలోని సుమారు 69 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు రైతులకు పంపిణీ చేసినట్టు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఒక్క వేరుశనగ పంట కాకుండా అంతర పంటలుగా మొక్కజొన్న, సామలు తదితర పంటలను వేస్తూ గిరిజనులు ఆదాయం పొందేందుకు సిద్ధమవుతున్నారు.

పనుల్లో రైతులు నిమగ్నం

ఈ వేసవిలో విస్తారంగా వరి సాగు చేసిన గిరిజన రైతులు వాటిని జూన్ మొదటి వారంలో నూర్పులు చేసి ఇళ్లకు తరలించారు. తద్వారా వర్షాభావ పరిస్థితులు అనుకూలిస్తుండడంతో వేరుశనగ, సామలు, మొక్కజొన్న నాట్లు చేసుకున్నారు. మండల వ్యాప్తంగా మొక్కజొన్న 100 ఎకరాల్లో రైతులు పండిస్తున్నారు. పసుపు సాగుపై రైతులు మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుతం మండలంలో పసుపు పంటలు సైతం అధిక మొత్తంలో నాటడం జరిగింది. వీటితో పాటు సొవ్వా, అరమ, సాగర, కంద్రుమ్, కురిడి, పోతంగి పంచాయతీల్లో రైతులు అధిక మొత్తంలో కూరగాయల పంటను సాగు చేస్తున్నరు. టమాటా, అల్లం తదితర పంటలకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ధరలు ఉన్నాయి. ప్రస్తుతం వేరుశనగ పంట మొక్క దశలో ఉండడంతో పంట పాడవకుండా ఉండేందుకు రైతులు కలుపు తీత పనులు చేస్తున్నారు. మరో రెండు మాసాల్లో వేరుశనగ, మొక్కజొన్న పంట చేతికి వస్తాయని గిరిజన రైతులు తెలుపుతున్నారు.



కలుపుతీస్తున్న రైతులు



పసుపు పంట

దిగుబడిపై ఆశలు



ప్రస్తుతం వేరుశనగ పంట సుమారు రెండు ఎకరాల్లో నాటడం జరిగింది. పంట వేసి మూడు వారాల్లో మొక్క దశకు రావడంతో కలుపుతీత పనులు చేపట్టాం. వ్యవసాయ శాఖ అందించిన వేరుశనగ విత్తనాల ద్వారా ఈ పంటలను చేపట్టాం. ప్రస్తుతం వేరుశనగ అధిక దిగుబడి వచ్చేందుకు కష్టపడుతున్నాను.

– కొర్రా బలరామ్, స్వర్ణాయిగుడ, కంద్రుమ్ పంచాయతీ

జోరుగా నాట్లు



ప్రస్తుతం నేను ఒక ఎకరంలో వేరుశనగతో పాటు మరో ఎకరంలో సామల పంటను వేశాను. కుటుంబ సభ్యులందరం కలిసి పనులు చేసుకుంటున్నాం. సామాల నారుమళ్ల కొసం కష్టపడి పండించి సామా పంటకు నాట్లు వేస్తున్నాం. గతంలో మంచి దిగుబడులు వచ్చాయి.

– గాసి కొర్రా, కంద్రుమ్ పంచాయతీ, దుంబ్రిగుడ.

కలుపు నియంత్రణ అవసరం

ప్రస్తుతం మండల వ్యాప్తంగా 200 ఎకరాల్లో వేరుశనగ, 90 నుంచి 100 ఎకరాల్లో మొక్కజొన్న పంటలతో పాటు అంతర పంటలుగా సామాలు తదితర పంటలను గిరిజనులు పండిస్తున్నారు. వేరుశనగలో దిగుబడి బాగా రావాలంటే కలుపు నియంత్రణ చేయాలి. మొక్క ఎదుగుదల బాగా అవుతుంది.

– వాసుదేవర, ఏవో, దుంబ్రిగుడ

తూతూ మంత్రంగా గ్రామసభలు

హాజరు కాని వివిధ శాఖల అధికారులు

రంపచోడవరం: కేంద్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రవేశపెట్టిన ధర్తీ ఆబ్ జన్‌భగిదరి అభియాన్ పథకంపై ఎంపిక చేసిన గ్రామాల్లో వివిధ శాఖ అధికారులు, సిబ్బందితో కమిటీలు ఏర్పాటు చేశారు. షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలకు అధికారులు హాజరై గిరిజనులకు అవగాహన కల్పించాలి. అయితే తూతూ మంత్రంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. మారేడుమిల్లి మండలం డి.వెలమలకోట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జన్ భగిదరి అభియాన్ గ్రామసభలకు మండలస్థాయి అధికారులు ఎవరూ హాజరు కాలేదు. ఐటీడీఏ ఏపీవో డీఎస్‌వీ రమణ హాజరై గిరిజనులకు అవగాహన కల్పించారు. గ్రామసభలో వివిధ శాఖల అధికారులు హాజరవడం ద్వారా గ్రామాల్లో ఆయా శాఖలు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించే అవకాశం ఉంటుంది. ఈ పథకంలో ఏజెన్సీలో 211 గ్రామాలను గుర్తించారు. గిరిజనులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు జన్‌భగిదరి అభియాన్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్‌లు, విద్యుత్ సౌకర్యం, పాఠశాలల ఏర్పాటు, మౌలిక సదుపాయాలు వంటి అనేక కార్యక్రమాలను ఎంపిక చేసిన గ్రామాల్లో అమలు చేస్తారు. ఏపీవో రమణ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ అందించనున్నట్టు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. డి.వెలమలకోటలో నిర్వహించిన గ్రామసభకు మండల స్థాయి అధికారులు ఎవరు హాజరు కాలేదని ఏపీవో తెలిపారు. సర్పంచ్ బట్ట సోమలమ్మ, కార్యదర్శి డి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీవో రమణ, వేదికపై సర్పంచ్ సోమాలమ్మ

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

ముంచంగిపుట్టు: పోస్టల్ శాఖలో ఐటి 2.0తో సాంకేతిక అప్‌గ్రేడ్ చేయడం జరుగుతుందని అరకు సబ్ డివిజనల్ పోస్టల్ ఐపీవో వి.లక్ష్మీకిషోర్ అన్నారు.ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలో పని చేస్తున్న పోస్టల్ బీపీఎంలు, ఏబీపీఎంలకు పోస్టల్‌శాఖలో త్వరలో ప్రారంభం కానున్న ఐటి 2.0పై శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు.అనకాపల్లి పోస్టల్ డివిజన్ కార్యలయం నుంచి ట్రైనర్ శంకరరావు శిక్షణ ఇచ్చారు. ఈ విధానం ద్వారా చేయాల్సిన పనులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈ సందర్భంగా ఐపీవో లక్ష్మీకిషోర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోస్టల్ సేవలలో నాణ్యతను మెరుగుపరచడానికి అమలుచేస్తున్న కొత్త సాంకేతిక విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వినియోగదారుల డేటా, లావాదేవీలను మరింత సురక్షితంగా ఉంచడం జరగుతుందన్నారు. బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులో మరికొన్ని సేవలను చేర్పించి, పోస్టల్ ఖాతాదారులకు మెరుగైన సేవలు గ్రామ స్థాయిలోనే అందిస్తామన్నారు. ఉత్తరాల బట్వాడా వేగంగా జరగడంతో పాటు జవాబుదారీతనం క్షణాల్లో ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పోస్టల్ సిబ్బందికి సహకరిస్తూ, పొదుపు ఖాతాలు తెరుస్తూ పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పెదబయలు ఎస్‌పీఎం బాపికుమార్, పీఏ రాజు, ఎంవో శ్రీను, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోస్టల్ సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

23న రూడకోటలో కంటి వైద్య శిబిరం

పెదబయలు: మండలంలోని రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఈ నెల 23న నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వైద్యాధికారులు కిశోర్, సత్యారావు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి(విశాఖపట్నం) సహకారంతో ఈ శిబిరం ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. దృష్టిలోపం ఉన్న వారు శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కంటికి శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ప్రత్యేక వాహనంలో విశాఖపట్నం తరలించి ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు. ఈ శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి



బిషప్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన చంద్రపాల్‌ను అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు

రంపచోడవరం: జిల్లా బిషప్ కౌన్సిల్ అధ్యక్షుడిగా రంపచోడవరానికిు చెందిన డాక్టర్ చంద్రపాల్‌ను నియమించినట్టు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయనను పలువురు అభినందించారు. బిషప్‌లందరూ క్రైస్తవుల సంక్షేమం కోసం, ఐక్యతతో ఉండేందుకు పాటుపడాలని ఆయన తెలిపారు.

వైభవంగా ఊంజల్ సేవ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో శుక్రవారం ఊంజల్ సేవా కార్యక్రమం జరిగింది. ప్రధాన అర్చకులు గోపాల కృష్ణ శర్మ, సూర్యనారాయణ శాస్త్రి వేదమంత్రాలతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు.

వెల్లువెత్తిన ఆధ్యాత్మికత



ఘటాల ఊరేగింపులో భక్తులు



మోదకొండమ్మ తల్లి ఆలయం వద్ద బారులు తీరిన వాహనాలు

పెదబయలు: మండల కేంద్రంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక హరిహరపుత్ర మోటర్ యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఘటాలను ఊరేగించి మోదకొండమ్మకు సమర్పించారు. అనంతరం అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మోదకొండమమ్మ తల్లి ఆలయంలో ప్రతీ వాహనానికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పూజలు చేశారు. భారీగా బాణా సంచా మందుగుండు సామగ్రి కాల్చారు. అనంతరం ఆంధ్ర, ఒడిశా సరిహద్దు గ్రామం సోభపుట్టు గ్రామ సమీపంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెదబయలు, రూడకోట, ముంచంగిపుట్టు, కిలగాడ ప్రాంతాలకు చెందిన మోటార్ యూనియన్ నాయకులు సమరెడ్డి లాలీబాబు, రవికుమార్, అంజిబాబు, శశిధర్, చిన్న, చిట్టిబాబు, మాజీ సర్పంచ్ పాంగి సింహాచలం, వాహన యజమానులు, డ్రైవర్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల్లో అక్రమ ఫీజుల దందా

పాడేరు రూరల్: ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజుల వసూలుకు పాల్పడుతున్నారని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులో మాట్లాడుతు ప్రైవేట్ పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమంగా అధిక ఫీజుల వసూలుకు పాల్పడుతున్నా ప్రభుత్వం, సంబంధిత శాఖాధికారులు పట్టించుకోకపోవడం విచరకారమన్నారు. ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో అవసరమైన సౌకార్యలు పూర్తిగా లేకుండానే నిర్వహిస్తు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. డబ్బులే లక్ష్యంగా ప్రైవేట్ విద్యా సంస్థ నిర్వాహకులు అక్రమ వసులు దందా నడిపిస్తున్నారని చెప్పార. పుస్తకాలు, యూనిఫాం, ఇతరాత్ర స్టేషనరీ పేరుతో ఏడాదికి రూ.20వేల నుండి రూ.40వేల వరకు ఫీజులు వసులు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం సంబంధిత ఉన్నతస్థాయి అధికారులు జోక్యం చేసుకుని ఫీజుల నియంత్రించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఉద్యమిస్తామన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు, ఏఐవైఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాధాకృష్ణ

ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా అందించాలి



కొంతిలిలో పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: గ్రామ పంచాయతీ కార్యాలయం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు సక్రమంగా అందుతుందని, పంచాయతీ కార్యాలయం నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశించారు. మండలంలలోని కొంతిలి పంచాయతీ కేంద్రంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఆయన స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. పంచాయతీ పరిధిలో ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు కోరారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కష్టకాలంలో తోడుగా ఉంటానని ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్, సర్పంచ్ రేగం రమేష్, నాయకులు రేగం శివ, చిన్నేశ్వరరావు, జయరామ్, మత్స్యరాజు, సాంబ తదితరులున్నారు.



రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

పాడేరు ఘాట్ రోడ్డులో మళ్లీ ట్రాఫిక్ జామ్



పాడేరు ఘాట్‌రోడ్డులో ఏసు ప్రభువు విగ్రహం మలుపు వద్ద రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు



పాడేరు ఘాట్‌రోడ్డులో ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలు

మలుపులో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

సాక్షి, పాడేరు: పాడేరు ఘాట్ రోడ్డులో ఏసు ప్రభువు విగ్రహం ఉన్న మలుపు వద్ద శుక్రవారం ఉదయం ఆర్టీసీ బస్సు నిలిచిపోవడంతో సుమారు అరగంట సేపు ట్రాఫిక్ స్తంభించింది. పాడేరు నుంచి విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్సును డ్రైవర్ మలుపు తిప్పలేకపోయాడు. దీంతో ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. తోటి ఆర్టీసీ బస్ డ్రైవర్లంతా ఈ బస్సును దిగువకు మెల్లగా దింపి ట్రాఫిక్ పునరుద్ధరించారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్



కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ

మురళీనగర్(విశాఖ): పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లమో సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి శనివారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఇందుకోసం విశాఖ ఉమ్మడి జిల్లాలో అరు హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్), పెందుర్తి, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఈ హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లి తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ జరుగుతుంది.

తీసుకురావాల్సిన సర్టిఫికెట్లు

కింది ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ కోసం తీసుకురావాలి. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత వాటిని తిరిగి తీసుకోవచ్చు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన రసీదు, పాలిసెట్ ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, 10వ తరగతి మార్కుల మెమో, 4–10వ తరగతుల వరకు స్టడీ సర్టిఫికెట్ (లేదా) 7 సంవత్సరాల నివాస ధ్రువపత్రం, టీసీ, ఆదాయ ధ్రువపత్రం (2022 జనవరి 1 లేదా ఆ తర్వాత జారీ చేసినది), కుల ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ 2025–26, పీడబ్ల్యూడీ (వికలాంగుల) సర్టిఫికెట్, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ జారీ చేసిన క్యాప్ సర్టిఫికెట్, ఆంగ్లో–ఇండియన్ సర్టిఫికెట్, ఎన్‌సీసీ సర్టిఫికెట్, స్పోర్ట్స్ సర్టిఫికెట్, స్కౌట్స్ అండ్ గైడ్స్ సర్టిఫికెట్.

ఇతర కేటగిరీల విద్యార్థులకు కౌన్సెలింగ్ షెడ్యూల్

(విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద)

జూన్ 25 : ఎన్‌సీసీ 1–40,000 ర్యాంకులు, పీడబ్ల్యూడీ 1 – చివరి ర్యాంకు

26 : స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 1 – 60,000 ర్యాంకులు, ఎన్‌సీసీ 40,001 – 80,000 ర్యాంకులు

27 : స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 60,001 – చివరి ర్యాంకు, ఎన్‌సీసీ 80,001 – చివరి ర్యాంకు

28 క్యాప్, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఆంగ్లో ఇండియన్స్ (1–చివరి ర్యాంకు వరకు)

గైస్, పాలిటెక్నిక్‌లలో ర్యాంకుల వారీగా నిర్దేశించిన కౌన్సెలింగ్ వివరాలు

తేదీ	కెమికల్ ఇంజినీరింగ్ (గైస్)	పాలిటెక్నిక్
జూన్ 21	1 - 7,500	7,501 - 15,000
22	15,001 - 23,500	23,501 - 32,000
23	32,001 - 41,000	41,001 - 50,000
24	50,001 - 59,000	59,001 - 68,000
25	68,001 - 77,000	77,001 - 86,000
26	86,001 - 95,000	95,001 - 1,04,000
27	1,04,001 - 1,12,000	1,12,001 - 1,20,000
28	1,20,001 - 1,27,000	1,27,001 - చివరి ర్యాంకు

ర్యాంకుల వారీగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ షెడ్యూల్

తేదీ	ర్యాంకులు
జూన్ 21	1 - 15,000
22	15,001 - 32,000
23	32,001 - 50,000
24	50,001 - 68,000
25	68,001 - 86,000
26	86,001 - 1,04,000
27	1,04,001 - 1,20,000
28	1,20,001 - చివరి ర్యాంకు

వెబ్ ఆప్షన్స్ షెడ్యూల్

జూన్ 25, 26	1 - 50,000 ర్యాంకులు
27, 28	50,001 - 90,000 ర్యాంకులు
29, 30	90,001 - చివరి ర్యాంకు వరకు
జూలై 1	ఆప్షన్ల మార్పిడి
జూలై 3	సీట్ల కేటాయింపు